


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## పండగ అంటేనే చదవడం!

బుక్ ఫేర్‌కి వెళ్తే ఏం కొనాలో అస్సలు తెలీదు. చిన్నప్పుడు శెలవుల్లో పదింటికల్లా అన్నం తినేసి, మా రామదండు సిటీ సెంట్రల్ లైబ్రేరీకి వెళ్తే, ఆ పుస్తకాల విభాగాలన్నీ చూస్తే అలాగే వుండేది. ఎవరెక్కువ పుస్తకాలు చదివారో, సాయకాలం పేపర్ మీద రాసి తీసుకు రమ్మనేది అమ్మమ్మ. దాంతో నేను చదివిన పుస్తకాలు ఇలా వుండేవి

1) మసూచి.. ఇంటి వైద్యం

2) సూర్యాకాంతం వంటల పుస్తకం

3) పాత కెరటాలు – మాలతీ చందూర్

4) బుజ్జాయి జోక్స్ పుస్తకం,

5) బాల పిల్లల పత్రిక

6) గుప్త జ్ఞానం పెద్దలకి మాత్రమే

7) వల్లకాట్లో మూడు ఒకట్లు – కొమ్మూరి సాంబశివరావు

8) రంగవల్లి– స్త్రీల సమస్యలు

8) డాన్‌క్విక్సోట్ – మిగెల్ ద సెర్వెంటెజ్ (తెలుగు అనువాదం)

9) అనుపమ కథ – ముదిగొండ శివప్రసాద్ (హారర్)

ఇలా పిల్లల విభాగంలోనుండి పెద్ద వాళ్ళ విభాగంలోకి కూడా వెళ్ళి కొన్ని పుస్తకాలు చదివేసి, పేర్లు రాసుకుని ఇంటికొచ్చి, అమ్మమ్మకి గర్వంగా "నేనే ఎక్కువ చదివా తెలుసా?" అని చూపించేదాన్ని.

అమ్మమ్మ ఒక్కొక్క పేరే చదువుతూ గుప్త జ్ఞానం దగ్గరకి వచ్చేసరికీ నోరు వెళ్ళబెట్టి 'ఇది కూడా చదివావా? ఏం అర్థమైందే?" అని అడిగింది.

"అర్థం కాలేదు. వెయ్యి పడడగలు మాత్రం అర్ధమైందా? మైదానం, చరిత్ర హీనులూ మాత్రం అర్థమైందా? నీకోసం చదివి పెట్టలేదూ?" అన్నాను.

అమ్మమ్మ నవ్వుకుని, "పిల్లల పుస్తకాలు, కాశీ మజిలీ కథలూ, బేతాళ విక్రమార్కుల కథలూ, పురాణాలూ మాత్రం చదువుకోవాలి. అలా అన్నీ చదివేసెయ్యకూడదు" అంది

చందమామలో వచ్చే లక్స్ సోపూ, టాఫీల ఎడ్వర్‌టైజ్ మెంట్స్ వరకూ ఓకే..'లోధ్ర'

"ఇది కూడా కొనుక్కుందాం అమ్మమ్మా" అంటే "అప్పుడే ఇవన్నీ ఎందుకో? అయినా చందమామలో ఈ ప్రకటన అవసరమా?" అని అమ్మమ్మ నెత్తి కొట్టుకునేది ఇంతలో "పరీక్షల్లో ఇది వాడితే, మెదడు పదునెక్కి, నూటికి నూరు మార్కులు రావడం ఖాయంట. నాకు ఇది కావాలి. లెక్కల పరీక్షకి వాడుతా" అని ఓ ప్రకటన చూపించి "కావాలి.. కావాలి" అని పేచీలు పెడ్తూ, కిందపడి దొర్లి ఏడుస్తుంటే, అమ్మమ్మ "నీకు ముక్కుపొడుం కావాలా? పరీక్షల్లో మార్కులు రావడం కోసం?" అని వీపు వాయించింది.

"మీ మెదడు చురుకుగా పని చేయగలందులకు మేధా ముక్కుపొడుంని వాడండి.

పరీక్షల్లో నూటికి నూరు మార్కులతో ఉత్తీర్ణులు అవుటకూ, ఆఫీసుల్లో త్వరితగతిన ఉన్నత పదవులు పొందుటకూ, మనసు కుదురుగా సంసారం నందు కలతలు లేకుండా వుండునందులకూ ఎల్లప్పుడూ వాడండి 'మేధా' వారి నశ్యం ఆకర్షణీయమైన డబ్బాలో మీకు అందజేయబడును" అన్నది ప్రకటన.. చందమామలో.

అమ్మమ్మ నోటిమీద వేలు వేసుకుంది. ఇంకోమాట, మా చిన్నతనంలో 78, 79లలో గుండువారి ఇంట్లో వాళ్ళ తెల్ల పంచె బామ్మగారు, కొంగు చివర్న ముక్కుపొడుం డబ్బా కట్టుకుని, రెండు వేళ్ళతో మధ్య మధ్యలో గట్టిగా పీలుస్తూ వుండేవారు. తనని చూడడానికొచ్చిన  కొడుకులతో " ముక్కుపొడుం అయిపోయింది రా నాయనా, కొంచెం తెచ్చి పెట్టండి" అంటే, "అలాగే నమ్మా" అని తెచ్చిపెట్టేవారు.

అంతేకాదు. ఇప్పట్లో నిషిద్దమైన 'ఓపియం' అని ఇంగ్లీషులో అనబడే నల్లమందుని కొందరు పెద్దవాళ్ళు, నిద్రపట్టని వాళ్ళూ, దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడేవారూ, రాత్రిపూట పాలలో తీసుకునేవారు.

ఇంక ఉమా గోల్డ్ కవరింగ్ నగలూ, బ్రిటానియా బిస్కెట్లూ, లక్స్ సోపులూ.. సినీ తారలసౌందర్య సాధనాలు, రెమీ టాల్కం పౌడర్లూ, సన్‌లైట్ సోపులూ మా ఇంట్లోకి ఆ రోజుల్లో ప్రకటనల ద్వారా నడిచి వచ్చాయి. వార్తా పత్రికల్లో 'రిలాక్స్ హేవ్ ఏ చార్మినార్' ఏడ్ చూసినప్పుడల్లా, రిలాక్స్ అవ్వాలంటే చార్మినార్ సిగరెట్ తాగలేమో అనుకునేదాన్ని.

ప్రకటనలకి అప్పుడే ఇంత ప్రభావం వుండేది. మాకు రిక్రియేషన్ ఆ రోజుల్లో రేడియోలూ, వార్తా పత్రికలూ, వార, మాసపత్రికలేగా. అందువల్ల వార్తా పత్రిక కొంటే 'అబిట్యురీ కాలం' కూడా వదిలేన్ని కాదు.

ఎక్కువగా ఆ రోజుల్లో క్రైస్తవులు, ఈ అబిట్యురీ కాలంలో ఎవరైనా పోతే ప్రకటన వేయించేవారు, ఏసురత్నంగారు జననం 1948 నిర్యాణం 1974 లాంటివి. మేరీ జోసెఫెన్ ఇమాన్యుయెల్ రాబర్ట్స్, కృపా ఆనందం జాన్మీన్ ఇలియట్స్.. ఇలా వరుసగా వారి పేర్లు రోజూ చదివి "అమ్మమ్మా ఈ క్రిస్టియన్స్ మాత్రమే ఎందుకని ఇలా చనిపోతున్నారు?" అని అడిగాను.

అమ్మ విని "మన రామనాథాలూ, సుబ్బారావులూ, రాజేశ్వరమ్మలూ కూడా పోతారు. మనం బంధువులకీ స్నేహితులకీ దినవారాలకి రమ్మని ఉత్తరం మాత్రం రాస్తాం" అని చెప్పింది.

"పేపర్లో వేయిద్దాం అమ్మా. గొప్పగా వుంటుంది ఎవరైనా పోతే మనవాళ్ళు" అన్నానో లేదో, వీపు విమానం మోత మోగింది. ఏం గొప్పగా మనం మాత్రం వేయించకూడదా? అని నాలో నేనే బాధపడ్డాను.

ఇలాగే ఓ రోజు "అమ్మా రామారావుగారి బావమరిది శివప్రసాద్ గారు పోయారుట. పేపర్లో వేయించారు చూడు" అని అరిచాను.

ఛ! నిన్ననే చూసాను. వాళ్ళింట్లో వ్రతం అని అమ్మ పేపర్ లాక్కుని చూసి "ఆయన అమెరికా వెళ్తున్నాడట, డాక్టర్ కదూ. అదీ శుభాకాంక్షలు చెప్తూ వాళ్ళ ఆస్పత్రి వాళ్ళు వేయించారు" అంది.

"అమ్మా నేనూ అమెరికా వెళ్ళాలంటే, డాక్టర్ అవ్వాలా? కానీ పుండ్లు రక్తం కారడం, కాలడం చీము రావడం, అగ్గిపెట్టెలో మలముత్రాలు తెమ్మనడం ఇవన్నీ నాకు ఇష్టం వుండదు. అమెరికా వెళ్ళలేనా?" అన్నాను.

"చక్కగా చదువుకుంటే వెళ్ళచ్చు. లేదా ఈ శివప్రసాద్ గారి లాంటి వాళ్ళ ఇళ్లల్లో పనిచెయ్యడానికి వెళ్తావు.. లే బడికెళ్ళు" అని కసిరింది అమ్మమ్మ.

ఆ రోజు క్లాసులో అమెరికాలో, నేను గిన్నెలు కడగడం, వీధులు వూడ్చి, కళ్ళాపి చల్లి ముగ్గులు పెట్టడం కల కన్నాను. ఏ పనీ తక్కువకాదు అయినా పనిమనిషిగా వెళ్ళడాన్ని అమ్మమ్మ ఎందుకు తక్కువ చేసిందీ? తాతయ్య అందుకే ఈవిడ చేత హరిజన ఆశ్రమాల్లో ఊడిపించడం, అన్నం వండి పెట్టడం లాంటివి చేయించాడు, మా బాగా అయింది అనిపించింది.

ఇలా పేపర్లూ, చందమామలూ, నుండి అమ్మలు చదివే వారపత్రికలకీ, నవలలకీ ప్రమోషన్ ఎప్పుడొచ్చిందో నాకు గుర్తేలేదు. ఆడవాళ్ళు వరండలలో ఓ మూల చేరి, చాప, చెంబూ పెట్టుకుని ,చూరులోంచి ఓ వారపత్రిక లాగి గొప్ప ఆసక్తిగా చదువుతుండేవారు. అలా చాప మీదెక్కినప్పుడు తప్పకుండా వారపత్రికలు చదవాలేమో అనుకునేదాన్ని.

'మృత్యోంగా అమృతంగమయా ', 'పచ్చని కలశంలో వెచ్చని కన్నీళ్ళు ' 'ఏటి ఒడ్డున నీటిపూలు ', 'క్రిష్ణవేణీ, 'చక్రభ్రమణం ' 'ఆ తరం కథా ' ఇలా అనేక సీరియళ్ళు ఆ రోజుల్లో చదివేసాను. అందులో 'ఆ తరం కథ ' రాసిన పి.వి క్రిష్ణమూర్తిగారు అమ్మతో ఆర్.టీ.సీలో పనిచేసేవారు. మా కాలనీలో వుండేవారు. ఓ రచయితని చూడడం అదే మొదటిసారి జీవితంలో. శలవల కొచ్చిన ఉమక్కా, మా రమక్కా నేనూ మూడు తలలు ఒకేసారి సీరియల్స్ అన్నీ కలిపి కుట్టిన పుస్తకంలో

తలదూర్చి చదివేసాం. అందులో ఆయన తన 'ఆత్మకథ ' అని రాసారు. ఆ నవలలో శేఖరం ప్రేమించిన రజని ఇప్పుడున్న ఆయన భార్యేనా, అన్నది మా మెదళ్ళని తొలిచేసిన ప్రశ్న. ఎందుకంటే రజని సన్నగా, అందంగా తీగలా వుండేదని రాసారు. వీళ్ళావిడ పాపం లావుగా వుంది. ఆయన్ని అడగాలంటే భయం. మా ఉమక్క "రచయితలందరికీ ప్రేమలు విఫలం అవుతాయి. అప్పుడే రచయితలు అవుతారు" అన్న జీవన సత్యం చెప్పింది . అయితే అదే అయింది పాపం. అనుకున్నాం.

ఆ తరువాత మనమూ మన కుటుంబ చరిత్ర రాయాలి. 'ఈ తరం కథ' అని పేరుపెట్టి పెద్ద బౌండ్ పుస్తకంలో మొదటిగా, మా అమ్మలు సావిత్రీ దేవీ, శ్రీదేవీ, సత్యవతీ దేవిల పేర్లు అనురాధా, కళ్యాణీ, వసుంధరలుగా మార్చి, వాళ్ళ లవ్ స్టోరీలతో స్టార్ట్ చేసాం. మా తరం వరకూ అందరి పేర్లూ మార్చే ప్రహసనం చాలా ముచ్చటగా సాగింది. ముగ్గురం గొలుసుగా రాసేవాళ్ళం. నేను చిన్నదాన్నని ప్రాముఖ్యత తక్కువగా ఇచ్చేవారు. వాళ్ళకేం తెలుసు. ఇలా రచయిత్రినయి చాలామందిని చెండుకు తింటానని. కాదులెండి మీరు బాగా రాస్తారు అని మీరు అనాలని నా తాపత్రయం.

ఉమక్క పెద్ద కంప్యూటర్ ఇంజనీర్ అయింతర్వాత ఇంజనీరింగ్ కాలేజ్‌లకే 'డీన్' అయింది. రమక్క తెలుగులో ఎం.ఏ చదివి, లెక్చరర్ అయి ఆ తర్వాత నేను కలలు కన్న అమెరికాలో అది కాపురం చేస్తోంది.

నేనేమో 'య'కీ 'మ'కీ తేడా తెలీదు దీనికి అని అక్కలు ఎద్దేవా చేస్తే ఏడ్చేదాన్ని. రచయిత్రినయి, నవలలూ, టీ.వీ సీరియల్స్లూ, సినిమాలూ, మీకోసం ఇలా కాలం దాటని కబుర్లూ రాస్తున్నాను. చిన్ననాటి చెరుకు గెడల్లా అవి నమిలిన తీపి రసాలు ఇప్పటికీ గుర్తొస్తూ ఆనందంగా వుంటుంది.

మా రెండో పెద్దమ్మ కొడుకు హనుమంతు అన్నయ్య మాత్రం నాకు యండమూరినీ, మల్లాదినీ, కొమ్మూరినీ పరిచయం చేసి నా ఎనిమిదో తరగతిలో కమర్షియల్ నవలల వైపు నా ధ్యాస మళ్ళించాడు..

యండమూరి యుగాంతం, పర్ణశాల, రుషీ, వెన్నెల్లో ఆడపిల్లా మల్లాదిగారి 'పారిపోయిన ఖైదీలూ ', 'మిసెస్ పరాంకుశం' 'రేపటి కొడుకు ' కొత్త ద్వారాలు తెరిచాయి. అంతదాకా శరత్‌బాబు పిచ్చిలో 'బడదీదీ ', 'విరాజ్ బహూ ' 'కట్టు తెగిన పిల్లా ', 'గృహదహనం , 'వాగ్దత్తా' అంటూ పైట కొంగుకి తాళాల గుత్తి కట్టుకుని, ఏకాదశి ఉపవాసాలు చేస్తూ బృందావనం, కాశీ వీధుల్లో తిరుగుతున్నదానికి దారి స్పష్టతగా అర్థమైనట్టు అనిపించింది. నా చిన్ననాటి గ్రంధాలయాలకీ, నా నెచ్చెలులకీ, నన్ను చదివించి, పుస్తకం అనే అమృతాన్ని పంచిన అందరికీ కృతజ్ఞతలు.. శుభాభినందనలు

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4